కాలువ వ్యథ

- అనేక చోట్ల గట్లు బలహీనం
- ప్రతిపాదనలు సరే... పనులు జరిగేనా?
- యూటీలకు దొరకని మోక్షం
- కింది ఆయకట్టుకు సక్రమంగా అందని సాగునీరు



లక్కవరంలో ప్రధాన పంట కాలువపై కూలిన వంతెన



మలికిపురం-గుడిమెళ్లంక మధ్య వేప చెట్టు డ్రెయిన్‌పై శిథిలమైన అండర్ టన్నెల్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ఇరిగేషన్ వ్యవస్థ అత్యంత బలహీనంగా ఉంది. ఒకవైపు రొయ్యల సాగు వల్ల శివారు ప్రాంతాల్లో పంట కాలువ, పంట బోదెలు సైతం కనుమరుగవుతుండగా, ఆయకట్టు ఉన్న చోట కూడా కాలువ పనితీరు అత్యంత దారుణంగా ఉంది. ప్రధాన మండల కేంద్రాలు, వ్యాపార కూడళ్ల మీదుగా గ్రామాలకు వెళ్లే పంట కాలువలను ఆక్రమించడానికి తోడు, చెత్తను సైతం కాలువల్లో వేస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు ఒకవైపు వేధిస్తుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాలువల మరమ్మతులు లేక ఆయకట్టు ప్రమాదంలో పడింది.

బలహీనంగా గట్లు

అనేక గ్రామాల్లో పంట కాలువల గట్లు నానాటికీ బలహీనపడుతున్నాయి. రాజోలు దీవిలో ఇరిగేషన్ కాలువలు ఏర్పడిన తరువాత పూర్తి స్థాయిలో కాలువలు తవ్వింది స్వల్పమే. అది కూడా కొద్దిపాటి పూడికలు తీసి మమ అని పించుకున్నారు తప్ప గట్లు పటిష్టపరిచింది లేదు. రాజోలు దీవిలో ప్రధానంగా పి.గన్నవరం ప్రధాన పంటకాలువ గట్టే సరిగా లేదు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సుమారు 21 కిలోమీటర్ల పొడవు ప్రధాన పంట కాలువ ప్రవహిస్తోంది. పెద తిప్ప నుంచి సఖినేటిపల్లి లాకుల వరకున్న కాలువ కుడి వైపు ఏటిగట్టు ఉంది. ఇది కూడా ఏటిగట్ల మరమ్మతు పనులు సక్రమంగా జరగకపోవడంతో బలహీనంగా మారింది. ఏటి గట్టు మినహాయించి మిగిలిన కాలువ గట్లు కూడా ఇరువైపులా అత్యంత బలహీనంగా ఉన్నాయి. కాలువకు ఓ మోస్తరు అధికంగా నీరు వదిలితే చాలు గట్లు పొర్లుతాయి. కొబ్బరి తోటలు సైతం ముంపునకు గురవుతున్నాయి. ఇక వరి చేలు జలమయం సాధారణమే. ఈ స్థాయిలో నీరు కాలువలకు వదలకుంటే కింది ఆయకట్టుకు నీరు అందదు. దీంతో దిగువ ఆయకట్టు రైతాంగం అవస్థలు పడుతోంది.

పలు గ్రామాల వద్ద..

పి.గన్నవరం ప్రధాన పంట కాలువ గట్టు మేడిచర్లపాలెం, దిండి, గుడిమెళ్లంక, రామరాజులంక, పెదతిప్ప వద్ద అత్యంత బలహీనంగా ఉంది. ఇక ప్రధాన పంట కాలువ నుంచి చింతలపల్లి ప్రధాన పంట కాలువల గట్లు చింతలపల్లి, లక్కవరం, పోతు మట్ల గ్రామాల్లో బలహీనంగా ఉన్నాయి. అంతర్వేది వెళ్లే ప్రధాన పంట కాలువ గట్టు శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం, అంతర్వేదిపాలెం గ్రామాల్లో పలు చోట్లు బలహీనంగా ఉంది. ఇక యలం కాయల కాలువ, శేషారాయుడు కాలువ, అప్పనరామునిలంక పాత కాలువ, కొత్త కాలువ, మోరి పంట కాలువ గట్లు కూడా పలు చోట్ల బలహీనంగా ఉండడం వల్ల నీరు పొర్లిపోతోంది. వర్షాకాలం వచ్చిందంటే ఈ సమస్య మరింత జటిలమవుతుంది.

అమలు కాని ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నీటి సంఘాలకు ఎన్నికలు పెట్టి పనులు చేస్తామని ప్రకటించారు. ఆరు నెలలైనా ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. పంట కాలువల క్లోజర్ పనుల పేరుతో చేస్తామన్న పనుల జాడ లేదు. రాజోలు దీవిలో సుమారు 20 కిలోమీటర్ల మేర వివిధ చోట్ల పంట కాలువల గట్లు పూర్తి స్థాయిలో బలహీనంగా ఉన్నట్లు నివేదికలున్నాయి. అలాగే పూడికలు కూడా తీవ్ర సమస్యగా మారింది. ఇక చింతలపల్లి, మలికిపురం గుడిమెళ్లంక సరిహద్దులో వేప చెట్టు డ్రెయిన్లపై ఉన్న అండర్ టన్నెళ్ల పునర్నిర్మాణం జరగ లేదు. శిథిలమైన వీటి ద్వారా సాగునీరు వృథా అవుతోంది.

ఆధునీకరణ చేపట్టాలి



ఇరిగేషన్ వ్యవస్థ శిథిలమై సాగునీటి సరఫరా మందగించింది. వరి సాగుకు రైతాంగం ఇబ్బంది పడుతోంది. వేసవిలో క్లోజర్ పనులు చేపట్టాలి. పూడికతీతతో పాటు శిథిలమైన అండర్ టన్నెళ్ల పునర్నిర్మాణం చేపట్టాలి.

– మట్టా శైలజ, జెడ్పీటీసీ సభ్యురాలు, రాజోలు

రూ.కోటితో క్లోజర్ ప్రతిపాదనలు



నియోజకవర్గంలో కాలువల్లో నీటి సరఫరా సక్రమంగా లేని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు క్లోజర్‌లో చేపట్టాలని రూ.కోటి అంచనాతో ప్రతిపాదనలు పంపాం. ఇంకా అనుమతి రాలేదు. అండర్ టన్నెళ్ల వంటి భారీ ప్రాజెక్టులకు ఇంకా ప్రతిపాదనలు చేయలేదు.

– బెహరా రమేష్, ఇరిగేషన్ జేఈ, రాజోలు

క్లుప్తంగా

అడవిపాలెంలో దుప్పి సంచారం



అడవిపాలెంలో దుప్పి

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం– అడవిపాలెం మధ్య మేజర్ డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో దుప్పి సంచరిస్తున్నట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. అటుగా వెళ్తున్న కొందరు మహిళలకు ఈ దుప్పి కంటపడడంతో వారు తీసిన వీడియో వైరల్ అయ్యింది. ఇక్కడికి దుప్పి ఎలా వచ్చిందనేది చర్చనీయాంశమైంది.

నిత్యాన్నదానానికి విరాళాలు

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన ఆర్‌వీఎస్ రామచంద్రశేఖర్ రూ.10,116, అదే పట్టణానికి చెందిన గోకవరపు రామనాగేశ్వరరావు దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా గ్రంథాలయాధికారి ఎంవీ సూరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చదవడం తదితర అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎం.సాయిరాజు, గణిత ఉపాధ్యాయురాలు ఎస్.దుర్గాభవాని పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మలికిపురం: మండలంలోని గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. నెల రోజుల పాటు హుండీకి వచ్చిన ఆదాయం రూ.1.89.564గా ఉందని అధికారులు వివరించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులతో పాటు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శంకరరావు అరెస్టు అప్రజాస్వామికం

కొత్తపేట: జనగణనతో పాటే సమగ్ర కులగణన జరపాలనే ప్రధాన డిమాండ్ చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావును అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సంఘ జిల్లా అధ్యక్షుడు సంసాని రామకృష్ణ అన్నారు. ఈ నెల 27న విజయవాడలో చేపట్టిన శాంతియుత మహా ర్యాలీని భగ్నం చేసి, శంకరరావు అరెస్టు చేయడాన్ని మంగళవారం ఇక్కడ ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పది రోజుల ముందుగా పోలీస్ కమిషనర్‌కు అనుమతి కోసం దరఖాస్తు చేశారన్నారు. దాని కనుగుణంగానే మహార్యాలీ జరుగుతుండగా పోలీసులు అడ్డుకుని, నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. సమగ్ర కులగణన నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు ముందుకు రాకపోగా, శాంతియుత ఆందోళనలను అడ్డుకోవడం తగదన్నారు. బీసీ ఉద్యమాలను అణచాలని ప్రయత్నిస్తే పదింతలుగా బీసీల ఐక్య ఉద్యమాలు చేపడతామని, ఆయా ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

సీపీఐ పటిష్టతకు కృషి చేయాలి

ఆలమూరు: రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ ఇండియా(సీపీఐ) పటిష్టతకు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ అన్నారు. స్థానిక సమతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వి.శ్యామ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన పార్టీ మండల శాఖ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలని, కొత్త సభ్యులను చేర్చుకోవాలని, ప్రజా సంఘాలను విరివిగా నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా జె.ఏసురాజు, సహాయ కార్యదర్శిగా జి.ఆనంద్‌తో కూడిన 11 మంది సభ్యుల మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు కె.రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, సత్తిబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

అయినవిల్లి: మోటార్ సైకిళ్ల చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. సిరిపల్లి గ్రామానికి చెందిన కుడుపూడి పవన్‌కుమార్, మరో బాలుడిని కోర్టుకు అప్పగించినట్లు చెప్పారు. వీరు ఐదు మోటార్ సైకిళ్లను దొంగిలించి, పోలీసులకు పట్టుబడ్డారన్నారు. నిందితుల్లో ఒకరికి రిమాండ్ విధించగా, బాలుడిని జువైనల్ హోంకు పంపినట్టు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ఆలమూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నలుగురు రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేశారు. పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, మెమెంటోలను బహూకరించారు. గుమ్మిలేరులో రూ.28.10 లక్షలతో నిర్మించనున్న సురక్షిత మంచినీటి వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, ఎంపీడీఓ ఎ.రాజు, ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం



దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

రాజోలు: రెండు చేతులు లేకపోయినా పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన రాజోలుకు చెందిన దివ్యాంగ విద్యార్థి చెల్లుబోయిన బాబికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంగ సత్యనారాయణ ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ ఈ సాయాన్ని అందజేశారు. ఉపాధ్యక్షుడు కారాడి వెంకట నరసింహారాజు, బి.రాచయ్య, మట్టపర్తి వెంకట కృష్ణారావు, మట్టపర్తి నరసింహారావు, గోలి బృహస్పతి, పెచ్చెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

రావులపాలెం: ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని డిపో మేనేజర్ జీజీవీ రమణ మంగళవారం అన్నారు. ఇందులో భాగంగా ప్రయాణికులు ఫిర్యాదులతో పాటు, సూచనలు తెలిపేందుకు బుధవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు 99592 25549, 99592 25537 నంబర్లకు ఫోన్‌కాల్ చేయవచ్చని తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

టెన్త్ ఉత్తమ విద్యార్థులకు ఆర్‌డీఓ సత్కారం



కొత్తపేటలో ఉత్తమ విద్యార్థినులను అభినందిస్తున్న ఆర్‌డీఓ శ్రీకర్

కొత్తపేట: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఉత్తమ విద్యార్థులు ఇదే ఒరవడి కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్‌డీఓ పి.శ్రీకర్ ఆకాంక్షించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల అభినందన సత్కార కార్యక్రమం మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళిక కను అడిగి తెలుసుకుని, ఆర్‌డీఓ పలు సూచనలు చేశారు. అనంతరం 587 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించిన స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సయ్యద్ రషీద్ బేగం, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి.వాణి శ్రీవిద్య (584), పి.లక్ష్మీప్రణవ్య (578)ను ఆర్‌డీఓ దుశ్శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జీవిత చరిత్ర పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్ సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు బి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మన్ననలతో పాటు ఆదాయాన్ని పెంచాలి

డీపీటీఓ రాఘవకుమార్



ఆదర్శ ఉద్యోగులకు అవార్డులు అందజేస్తున్న డీపీటీఓ

రావులపాలెం: ప్రతి ఒక్కరూ ఉన్నత ఆశయాలతో సమష్టి కృషి చేసి ప్రజల మన్ననలు పొందటమే కాకుండా, ఆర్టీసీ కార్గో ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని డీపీటీఓ రాఘవకుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ జరిగింది. డిపో మేనేజర్ జీజీవీ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రాఘవ కుమార్ మాట్లాడుతూ, వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ డిపో అభివృద్ధికి సహకరించాలన్నారు. అత్యుత్తమ ఆదాయం తీసుకొచ్చిన ముగ్గురు కండక్టర్లకు, కేఎంపీఎల్‌లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు డ్రైవర్లకు క్యాష్ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే గ్యారేజీలో ఆరుగురు సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు, క్యాష్ అవార్డులు అందించారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్ర దాడి దోషులను కఠినంగా శిక్షించాలి



అంబాజీపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంబాజీపేట: పహల్‌గాంలో జరిగిన ఉగ్ర దాడి దోషులను కఠినంగా శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేశారు. ఉగ్ర దాడిని ఖండిస్తూ, మృతులకు శాంతి చేకూరాలని అంబాజీపేట అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పర్యాటకులపై దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. మృతులకు ఆత్మశాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, శాంతి ర్యాలీ నిర్వహించారు.

జూనియర్ బాలామృతంతో మెరుగైన ఆరోగ్యం

ప్రారంభించిన ఆర్‌డీఓ శ్రీకర్



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఆర్‌డీఓ

ఆలమూరు: చిన్నారుల మెరుగైన ఆరోగ్యం కోసం నూతనంగా ప్రవేశపెట్టిన జూనియర్ బాలామృతం పోషక పదార్థాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డీఓ పి.శ్రీకర్ కోరారు. అక్షయపాత్రలో భాగంగా జూనియర్ బాలామృతం పంపిణీకి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా జొన్నాడలోని నాగిరెడ్డి వారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రం ఎంపికైంది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి, సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాలామృతం పథకాన్ని ఆర్‌డీఓ మంగళవారం ప్రారంభించారు. జూనియర్ బాలామృతం వల్ల కలిగే ప్రయోజనాలను లేదా సమస్యలను నెల రోజుల తర్వాత చిన్నారుల తల్లిదండ్రుల అభిప్రాయాన్ని తీసుకోనున్నట్లు ఆర్‌డీఓ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గ్రామంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆర్‌డీఓ తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న విద్య, ఇతర విషయాలపై ఆరా తీశారు. రికార్డులను, చిన్నారుల బరువును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలని, నిర్ణీత సమయంలో పౌష్టికాహారాన్ని అందజేయాలని ఆదేశించారు. చిన్నారుల పౌష్టికాహారం, వసతులు, ఆట వస్తువులు, విద్యా బోధన తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొద్దిసేపు చిన్నారులతో ముచ్చటించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: సందీప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎస్ కాంప్లెక్స్‌లో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) తెలిపారు. శ్రీవెంకట సందీప్ ఐ క్లినిక్ – ప్రాథమిక కంటి ఆస్పత్రి ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు చిన్న పిల్లలు, కంటి, చర్మవ్యాధులు, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ), జనరల్, ఇతర వ్యాధులకు సంబంధించి అమలాపురం, మండపేట, రావులపాలెం, కొత్తపేట ప్రాంతాలకు చెందిన వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. కొత్తపేట, పరిసర ప్రాంతాల వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓఎన్‌జీసీ సహకారంతో తాగునీటి సరఫరా



తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న సర్పంచ్

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న బొరుసు వారి వీధి, మేడిది వారి గ్రూపునకు మంగళవారం నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఓఎన్‌జీసీ సమకూర్చిన రెండు ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజు గ్రామస్తులకు 44 వేల లీటర్ల తాగునీరు అందిస్తామని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ తాగునీటి సరఫరాను సర్పంచ్ మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తులకు తాగునీరు అందించేందుకు ఓఎన్‌జీసీ ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీరు అందిస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు కోలా సత్యనారాయణ, తెలగారెడ్డి ఏసు, గ్రామ పెద్దలు, ఓఎన్‌జీసీ అధికారులు పాల్గొన్నారు.

సారాతో అనర్థాలు

ఎక్సైజ్ సీఐ కాత్యాయని

కొత్తపేట: సారాతో అనేక అనర్థాలు కలుగుతాయని, దానికి దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కొత్తపేట సీఐ కె.కాత్యాయని హెచ్చరించారు. సారా రహిత మండలంగా తీర్చిదిద్దడంలో భాగంగా వెలిచేరు, పేరవరం, రాజవరం గ్రామాల్లో మంగళవారం బుర్రకథ రూపంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, సారా వల్ల అనర్థాలు, దుష్ఫలితాలను ప్రజలకు వివరించారు. సారా తయారీ, విక్రయాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఈ మండలాన్ని అన్ని శాఖల సహకారంతో సారా రహిత మండలంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మండల దత్తత అధికారి, ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం మాట్లాడుతూ, సారాపై టోల్ ఫ్రీ నంబర్ 14405కు సమాచారం ఇవ్వవచ్చని చెప్పారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జి.విజయభారతి, వేముల శ్రీనివాస్, జాన మంగమ్మ, మహిళా కానిస్టేబుళ్లు, డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



రాజోలులో రిలే దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగులు

రాజోలు: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. డ్రైవర్లు జీవీవీఎస్ నారాయణ, ఎస్‌వీవీఆర్ రాజా, డి.రాజ్‌కుమార్ దీక్షల్లో కూర్చున్నారు. రాజోలు డిపో అధ్యక్షుడు సీహెచ్ బాబు, కార్యదర్శి ఎస్ఎస్ వాసు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

వైద్యం కోసం ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.11,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కొత్తపేటకు చెందిన బండారు లక్ష్మి సుభద్ర వయస్సు 46 ఏళ్లు. ఆహారం వెళ్లే పేగుకు క్యాన్సర్ సోకడంతో వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికి రూ.2 లక్షల వరకు ఖర్చయింది. ఇంకా ఖర్చు పెట్టే స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో సుభద్ర కుమార్తె సౌజన్యకి సంస్థ సభ్యులు రూ.11,500 చెక్కును అందజేశారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయప్రసాద్

మలికిపురం: సమాజంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజోలు నియోజకవర్గ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మలికిపురం పూలే–అంబేడ్కర్ సామాజిక భవనంలో దళిత సంఘ నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. దళిత సంఘాల జేఏసీ నాయకులు సరెళ్ల విజయప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని లక్కవరం గ్రామంలో ఓ వ్యక్తి మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని, ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ జేఏసీ అధ్యక్షులు చింతా రాజబాబు, డీహెచ్‌పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు దేవ రాజేంద్రప్రసాద్, దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, బహుజన సమన్వయ సమాఖ్య అధ్యక్షుడు గెడ్డం తులసీ భాస్కరరావు, ఎస్సీ సంక్షేమ సంఘ నాయకులు గెడ్డం ఫిలిప్‌రాజు, తోటే ప్రతాప్, నల్లి శివకుమార్, తోటే రాజేష్, చింతా శ్రీనివాస్, మట్టా సురేష్, చిలకపాటి శ్రీధర్, కొల్లాబత్తుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత భవిష్యత్తు



విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఎంఈఓ, నాయకులు

కొత్తపేట: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అన్నారు. మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముక్తేశ్వరం పాలిటెక్నిక్ కాలేజీ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ముగింపు మంగళవారం జరిగింది. సంఘ అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముగింపు సందర్భంగా మోడల్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, బహుమతులు అందజేశారు. మండలంలో 12 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతి స్కూలు విద్యార్థి, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. జిల్లా బీసీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు కడలి వెంకటేశ్వర్లు, జిల్లా సభ్యులు ఆదివారపుపేట వెంకటేశ్వరరావు, జేవీవీ జిల్లా సెక్రటరీ ఎండీ ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు పూలే నేషనల్ ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ కథకుడు, కళా భూషణ్ మంగం సత్యనారాయణకు పూలే నేషనల్ ఐకాన్ అవార్డు లభించింది. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో తనకు ఈ అవార్డు అందజేశారని సత్యనారాయణ మంగళవారం ఇక్కడ తెలిపారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. దీనిలో భాగంగా సత్యనారాయణకు షీల్డు, ప్రశంసా పత్రం అందించి, శాలువాతో సత్కరించారు. అవార్డు అందుకున్న సత్యనారాయణను స్థానికులు అభినందనలు తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియాతో అప్రమత్తం



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

మామిడికుదురు: ప్రజలు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ బృందం హెచ్చరించింది. మంగళవారం పాశర్లపూడిలో దీనిపై అవగాహన సదస్సు జరిగింది. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. సికిల్ సెల్ కణాలు శరీరంలో రక్త కణాల పరిమాణం తగ్గడానికి దారి తీస్తాయని వైద్య బృందం పేర్కొంది. దీనివల్ల రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్ర ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు వ్యాధి ప్రధాన లక్షణాలని వివరించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ రాజేంద్రబాబు, ఎల్‌టీ హరిశ్చంద్ర, హెల్త్ అసిస్టెంట్ కొమ్ముల సూర్యనారాయణ, ఏఎన్ఎం భూలక్ష్మి, వెంకటలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

సీనియర్ కార్యకర్తకు గన్నవరపు పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు

మామిడికుదురు: పాశర్లపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త చిక్కం శ్రీనివాసరావు ఇటీవల రాజమండ్రిలో సర్జరీ చేయించుకున్నారు. అమలాపురంలోని స్వగృహం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, నెల్లి దుర్గాప్రసాద్, గుత్తుల నాగబాబు, చిక్కం బుజ్జిబాబు, తులా గోపాలకృష్ణ, బాలం రమేష్, పిల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.